# మీరేమంటారు?

డి. కామేశ్వరి

'అమ్మగారూ..' అంటూ రేణుక పేపరు పట్టుకు పరిగెత్తుకు వచ్చింది.

'ఏమిటి రిటెన్ పరీక్ష రిజల్ట్స్ వచ్చేశాయా' రేణుక మొహం చూసి రిజల్ట్స్ గ్రహించా. ఆ అమ్మాయి మొహం ఆనందంతో వెలిగిపోతూంది. ఐ.ఎ.ఎస్ రిటెన్ టెస్ట్‌లో పాసవడమేకాదు, ముందు నూట యాభై మందిలో రేణుక పేరుంది. 'కంగ్రాట్స్ - సాధించావు' అంటూ రేణుక చెయ్యి నొక్కాను.

రేణుకలాంటి అమ్మాయి ఐ.ఎ.ఎస్ పరీక్ష రాసి అంత మంచి రాంక్‌తో పాసవడం అంటే నిజంగా గొప్ప విషయం సాధించడమే.

అట్టడుగు షెడ్యూల్డ్ క్లాసులో పుట్టి, బంట్రోతు ఉద్యోగం చేసే తండ్రికి, నాలుగిళ్ళలో పాచి పని చేసుకునే తల్లికి పుట్టిన రేణుక ఐదో క్లాసు మొదలు ఎన్ని రకాల అవరోధాలు ఎదుర్కొని చదువుకుందో! 'సర్లే. సదివింది, ఉత్తరం ముక్క రాయడానికి వచ్చింది. ఆడ పిల్ల నా చేతికి అంది వచ్చింది. ఇంట్లో కుండ మండ కడిగి కూడొండి, ఇంకో ఇల్లు అది పని చేసుకుంటుంది. ఇంక ఇస్కూలుకి పంపద్దు' అని రోజూ పోట్లాడే తల్లి ఇంట్లో. 'నే స్కూలుకి పోతా' అంటూ ఏడ్చి రాగాలు పెట్టేది రేణుక. ''అది చక్కగా చదువుకుంటానంటే ఇస్కూలుకి పోవద్దంటావేటే, అదీ సదువు సట్టుబండలు కాకుండా నీలా నాలుగిళ్ళల్లో పాచిపని సేసుకు బతకాలా. దాన్ని సదూకోనీ. ఆడోళ్ళందరూ సక్కా సదూకుని ఉద్యోగాలు చేస్తున్నారు. మా ఆపీసునిండా ఆడోళ్ళే... నా కూతురిని సదివించి ఉద్యోగం సేయిస్తా.' నర్సింగరావుకి ముందునించి తన పిల్లలు తనలా కాక కాస్త మంచి ఉద్యోగాలు చెయ్యాలని ఆశపడే వాడు.

'ఓ యబ్బ, నీ కూతురిని కలకటేరు సేద్దు...' వ్యంగ్యంగా వెక్కిరించేది యాదమ్మ.

''ఏం. అయినోళ్ళందరూ ఇంతకంటే గొప్పోళ్ళేమిటి. అది ప్రతి క్లాసులో ఫస్టు వస్తూంది. స్కూల్లో అయ్యవార్లు నీ కూతురు తెలివైందయ్యా అంటున్నారు తెలుసా - దాన్ని సక్కా సదూకోనీ!''

''అదంతా నాకు తెలీదు - నాలుగిళ్ళల్లో ఒక్కర్తిని సేయలేక సేతులడిపోతున్నాయి. పన్నెండేళ్ళ పిల్ల సేతికందొచ్చింది. ఒక ఇల్లు అది సేసుకుంటుంది. ఇంటికైన అప్పు తీర్చాల - ఏడనుండి తెస్తాం. మీ సెల్లి పెళ్ళికి అప్పు సేసావు. అదెక్కడనించి తీరుస్తావు...' ఏకరువు పెట్టింది.

నర్సింగరావు ఇన్‌కంటాక్స్ ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం. గవర్నమెంటు జీతంతోపాటు రోజూ పదిపాతిక వచ్చిపోయే వారు చేతిలో పెడుతుంటారు. అయినా ఎంతొచ్చినా ముగ్గురు పిల్లలు, తల్లి, చెల్లెలు బాధ్యత వుండడంతో డబ్బుకి ఇబ్బందే! ఆ మధ్య రెండు గదుల కొంప కాస్త అప్పుచేసి కొన్నాడు. ఆ అప్పు తీరకముందే చెల్లెలు పెళ్ళికి ముప్పై వేలయింది. అదో అప్పు. యాదమ్మ నాలుగిళ్ళలో పని చేసి వెయ్యి రూపాయలు తెచ్చినా అంతా కల్సి బొటాబొటి బతుకులే వారివి.

''సర్లే - అప్పులు, మన బతుకులు అట్టాగే వుంటాయి. చదువాపి దీని బతుకు బుగ్గి సెయ్యాలా - సదూకుని అదైనా బాగుపడనీ.''

'సదూకుంటే, రేపొద్దున పెళ్ళి సేయద్దా - పన్నెండో ఏడు వచ్చింది. మళ్ళీ రెండేళ్ళాగితే అదీ పెద్ద ఖర్చు నెత్తిన ఉంది.'

'నీ నోట బండపడ. దానికి ఇప్పటినించి పెళ్ళేటి. నీవు నోరు మూసుకుండు అది సదూకుని ఉద్యోగం సేస్తేగాని పెల్లిసేయ' నర్సింగరావు తిట్టేవాడు.

'అమ్మా.. నేనిదే సెపుతున్నా. నేను స్కూలు మాన... నన్నాపితే సెర్లోపడి సస్తా' వింటున్న రేణుక ఉక్రోషంగా అంది.

ప్రతి ఏడు ఇంట్లో గొడవ పడ్తూనే ఏడో క్లాసు ఫస్టున పాసయింది. ఆ తరువాత మెట్రిక్‌లో స్కూలు ఫస్టొచ్చింది. నర్సింగరావు ఆనందానికి అంతులేదు. కూతురు అప్పుడే కలక్టరయినంత ఆనందపడిపోయాడు. 'పదహారేళ్ళొచ్చాయి. సతికింది సాలు ఇంక పెల్లి సేయి. ఇంకా సదివిస్తే మొగుడే దొరకడు' అంటూ గొడవ ఆరంభించారు ఇంట్లో తల్లి, నాయనమ్మ.

'మీ అన్న కొడుకు ముచ్చట పడ్తున్నాడు. రేణుకని సేసుకుంటానని, మాఘమాసంలో ముహూర్తాలు ఎట్టమంటున్నాడు.'

''ఏంటి, నీ అన్న కొడుకా. ఆ లోఫర్ గాడికి నా కూతుర్నిస్తానా. ఎనిమిదో క్లాసు పాసవకుండా జులాయిలా తిరిగే ఆడితో పెళ్ళా.''

''ఓయబ్బ నీ కూతురి కంతకంటే గొప్ప మొగుడొస్తాడులే. ఆళ్ళకేం మిద్దిల్లు ఉంది. రెండెకరాలు పొలం ఉంది. మా అన్నకి గవర్నమెంటు నౌకరి. ఆడి



పెళ్ళాంకి బ్యాంకిలో అటెండరుద్యోగం. ఇద్దరికి కలిపి ఆరేడు వేలు పైన వస్తాయి. మల్లేశు ఏదో కుర్రతనం, కుదురు లేదు. రేపు పెళ్ళి చేస్తే ఎక్కడో చోట మా అన్న ఉజ్జోగం ఏయిస్తాడు. కుదురు అదే వస్తది.'''

''అమ్మో'' అరిచింది రేణుక. ఆ పిల్ల మొహం ఎర్రబడిపోయింది.

''మల్లేశు బావంటే నాకసయ్యం. ఛీ. ఆడితే పెళ్ళేటి. అసలు నేను కాలేజీలో



సదూకుంటా. పెళ్ళి సేసుకోను'' తండ్రి వత్తాసుతో రేణుక ఖచ్చితంగా చెప్పేసింది.

యాదమ్మ నా దగ్గిర మొత్తుకుంది. 'ఏమిటి యాదమ్మా, పెళ్ళో పెళ్ళో అంటావు. చదువుకున్నాక చేసుకుంటుంది. మేమంతా చదూకుని చేసుకోలేదా. ఎన్నాళ్ళయినా మీరు మారకపోతే ఎలా. రేణుక స్కూలు ఫస్టు వచ్చింది. దానికి స్కాలర్‌షిప్ ఎలాగూ ఇస్తారు. జీతం కట్టక్కరలేదు. బాగా చదువుతున్న దాన్ని చదువుకోనీ. చదువు రాకపోతే అది వేరే సంగతి. నీ కూతురు నీలా అంట్లు తోముకు బతకాలనా నీ కోరిక' అంటూ కూచోపెట్టి నచ్చ చెప్పాను. రేణుకకి నేనంటే నా మాటంటే గౌరవం బ్యాంకిలో పని చేస్తున్నానని. తనూ అలా చదువుకోవాలని ఉద్యోగం చెయ్యాలని ఆ పిల్ల ఆశ. రేణుకకి ప్రతి సంవత్సరం స్కూలు నోటు పుస్తకాలు కొనిస్తాను. మా అబ్బాయి రేణుక కంటే ఓ క్లాసెక్కువ. ఆ పుస్తకాలు, వాడి నోట్సులు అన్నీ ఇచ్చి శలవుల్లో చదవమంటాను. మెట్రిక్ పాసై ఫస్టు వచ్చిందని దానికి కాలేజీకి వెళ్ళడానికి నావి రెండు, మూడు నైలక్స్ చీరలు, ఒక కొత్త సల్వార్ కుర్తా కొనిపెట్టాను.

అందరూ ఒకటయ్యేసరికి చదువుతున్న రేణుక తమకంటే భిన్నంగా, చక్కగా ఎదగడం, ఆమె మాటల్లో, చేతల్లో మార్పు అది చూసి యాదమ్మ కూడా మెత్తబడింది. చదువుకుంటే తన కూతురు తనలా నాలుగిళ్ళలో పని చేసే ఖర్మ తప్పుతుందన్న మాట



## కరిష్మా రోల్ కొట్టేసిన ఊర్మిళ

*'దిల్లగీ' సిన్మాలో కరిష్మా కపూర్ వేయాల్సిన పాత్ర నీవు తస్కరించావటగా? అందరూ అంటున్నారు నిజమా! తప్పుగాదూ పిల్లా? 'భలే వారే! ఓ పత్రిక్కి ఒక తార ఇంటర్వ్యూ ఇవ్వలేదనుకోండి. ఆ పత్రిక వాళ్ళు ఇంకో తార దగ్గరికెళ్ళి అడిగితే, ఆ తార ఇంటర్వ్యూ ఇస్తానందనుకోండి. ఇంటర్వ్యూ తీసుకుంటారా లేదా? ఇదీ అదే టైపు. దీంట్లో మోసమేముందీ? అయినా నేను నిర్మాతలని ఎప్పుడూ ఫోర్స్ చెయ్యను. మోసం చెయ్యను. ఎంతో గౌరవిస్తా!(?) దిల్లగీలో అవకాశం వచ్చింది. వదులుకోదల్చుకోలేదు. అంతే' – అని కూల్‌గా జవాబు చెబుతోంది రంగీలా పిల్ల ఊర్మిళ. ఇంతకీ దీన్ని చౌర్యం అంటారా? తస్కరణ అంటారా? లేక అవకాశాన్ని వాడుకోవడం అంటారా? కరిష్మా నడగాలా? (రాంగోపాల్ నడిగితే జవాబు చెబుతాడా?)*

బుర్రకి తట్టింది ఆఖరికి.

కాలేజీలో ఎంపిసి గ్రూప్ తీసుకోమన్నా– లెక్కలు బాగా చేస్తుంది. రేపు ఏ ఇంజనీరింగ్ చదవాలన్నా పనికొస్తుందని సలహా ఇచ్చా. 'ఇంజనీరు కాదమ్మా. నా కూతురు కలెక్టరు అవాలి' అన్నాడు నర్సింగరావు గర్వంగా. నవ్వాను. 'కలక్టరో, ఇంజనీరో ముందు ఇంటర్ అవనీ, ఎంపిసి అయితే ఏదన్నా చదవచ్చు' అని సలహా ఇచ్చాను. ఆఖరు ఏడు ఆర్నెల్లు పాటు లెక్క లకి ట్యూషన్ కూడా పెట్టించాడు డబ్బుకిబ్బంది పడుతూనే. కూతురు చదువే ధ్యేయంగా మారింది అతనికిప్పుడు.

అందరి ఆశలను వమ్ము చేయకుండా రేణుక ఇంటర్‌లోను ఫస్టు క్లాసు తెచ్చుకుంది ఎనభై రెండు శాతం మార్కులతో. ఆరోజు ఆ వాడవాడంతా స్వీట్లు పంచిపెట్టి పొంగిపోయాడు. నర్సింగరావు అదృష్టానికి అంతా ఈర్ష్య పడ్డారు. యాదమ్మ నా దగ్గిరకొచ్చి కళ్ళు తుడుచుకుంది. 'దాన్ని సూస్తే నా కూతురేనా అనిపిస్తుంది అమ్మగోరూ. మీ అందరూ సెప్పబట్టి గాని కాకపోతే అది ఈపాటికి సంటి వెంటులో ఇల్లు సంసారంలో పడేది. మొద్దు మొకాన్ని, సదూకుంటే ఎంత గొప్పగుంటదో తెల్సిందమ్మా.'

'అప్పుడే ఏమిటి. నీ కూతురు కలెక్టరు అవనీ, కారులో తిప్పి కింద కాలుపెట్టకుండా కుర్చీలో కూచోపెడ్తుంది. చూస్తుండు ఇంక మూడు నాలుగేళ్ళల్లో నీ కూతురు ఎంత గొప్పదవుతుందో' నవ్వుతూ అన్నా. యాదమ్మ కళ్ళ నిండా నీరు. అసలు రేణుకని చూస్తుంటే నాకే నమ్మశక్యంగా లేదు. ఊడిపోయే లాగు, చీమిడి ముక్కుతో 'గీ' అంటూ ఏడుస్తూ తల్లి వెంట మా ఇంటికి వచ్చే ఆనాటి రేణుకేనా ఈనాటి రేణుక! పెద్ద అందం లేకపోయినా చామన చాయగా కనుముక్కు తీరుతో పదహారేళ్ళ రేణుక విరిసి విరియని మొగ్గలా నాజూకు తేలింది. విద్య ఇచ్చిన విజ్ఞానం కళ్ళల్లో, మొహంలో ప్రతిఫలిస్తూ విద్య మొసగు విషయంబు అన్నట్టు మాట, చేత అంతా మారింది. చదువు ఇచ్చిన సంస్కారం మిగతా అందరికంటే భిన్నంగా కనిపింప చేస్తూంది. ఇంకా కాస్త మంచి ఇంట్లో పుట్టి, కాన్వెంట్లో చదువుకుని మోడర్న్ డ్రెస్సులు వేసుకుంటే ఇంకా స్మార్ట్‌గా కనిపించేది. పాపం రేణుకకి వచ్చిన లోటల్లా ఫ్లూయంట్‌గా ఇంగ్లీషు మాట్లాడలేదు. తెలుగు మీడియంలో చదివిన పిల్లలకి ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం తక్కువే. అందుకే రోజూ పేపరు చదవాలి. జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, కథల పుస్తకాలు చదవాలి అని చెప్పేదాన్ని. కలెక్టరు పరీక్ష రాయాలంటే జనరల్ నాలెడ్జ్ బాగా వుండాలి అని ఇంట్లో నేను చదివే పుస్తకాలు, మా పిల్లలు చదివే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు ఇచ్చి చదవమనే దాన్ని.

ఇంటరయ్యాక ఎంసెట్ పరీక్ష రాయడమా, డిగ్రీ చేసి ఐ.ఎ.ఎస్ పరీక్ష అన్న విషయం మళ్ళీ చర్చకు వచ్చింది. నర్సింగరావు ఎంతసేపూ ఐఎఎస్ మీదే మొగ్గు, మోజు! అంతేకాక, ఇంజనీరింగ్ అంటే గవర్నమెంట్ కాలేజీలో సీటు వచ్చినా మినిమమ్ ఫీజులుంటాయి. బస్సు ఛార్జీలు, పుస్తకాల ఖర్చు అవి కట్టే శక్తి లేదు అతనికి. రేణుకా 'అమ్మో నాలుగేళ్ళు చదవాలి' అంది. నాకూ ఆడపిల్లకి ఇంజనీరింగ్ కంటే కాంపిటీటివ్ ఎగ్జామ్స్ నయం. ఐ.ఎ.ఎస్‌లో అంత బాగా చేయకపోయినా ఐ.పి.ఎస్, ఎక్సైజ్, ఇన్‌కంటాక్స్ వగైరా ఉద్యోగావకాశాలు ఉంటాయి అనిపించింది.

బి.ఎ డిగ్రీ చేశాక ఓ ఏణ్ణర్థం రేణుక రాత్రింబగళ్ళు ఐఎఎస్‌కి ప్రిపేరవుతూనే ఉంది. ఓ ఏడాది కోచింగ్ సెంటరులో చేరింది. ఆరు నెలల పాటు చదువు తప్ప మరో ధ్యాస లేదు. ఇంట్లో వీలుకాకపోతే మా ఇంటికొచ్చి వరండాలో కూర్చునేది. నర్సింగరావు శక్తికి మించి కోచింగ్ సెంటర్లకి, పుస్తకాలకి ఖర్చు పెట్టాలి. ప్రావిడెంటు ఫండు నించి అప్పు కూడా చేశాడు. ప్రిలిమినరీలో బాగా పాసై రిటైన్ టెస్ట్‌కి అర్హురాలైంది. అప్పుడే సగం కలెక్టరయి పోయినంత నిశ్చింత కలిగింది రేణుకకి. రిటెన్ టెస్ట్ పాసై పేపర్లో రిజల్ట్సు వచ్చిన రోజు నర్సింగరావు ఏడిచేశాడు ఆనందంతో. మొదటి నూట యాభై మందిలో రేణుక పేరుంది.

''కంగ్రాట్స్యులేషన్స్ రేణుకా, నర్సింగరావూ నీ కష్టానికి ఫలితం రాబోతోంది. ఇంకేముంది ఇంటర్వ్యూలో బాగా చేస్తే చాలు'' అన్నా.

''అంతా దేముడి దయ తల్లీ. రేణూ గుడికెళ్ళి కొబ్బరికాయ కొట్టరా. ఇంటర్వ్యూలో నెగ్గితే సంతోసి వ్రతం పదారు సుక్రాలు సేస్తానని మొక్కుకో. ఇందఈ డబ్బెట్టి ఏదన్నా కొనుక్కో'' వంద రూపాయలు చేతిలో పెట్టాడు. నేను లోపలికెళ్ళి నిన్న చేసిన కొబ్బరి ఉండలు తెచ్చి రేణుక నోరు తీపిచేశాను. 'ఇంటర్వ్యూ తారీకు వచ్చే వరకు ఇంకా పరీక్షలయి పోయాయని అశ్రద్ధ చేయకు. జనరల్ నాలెడ్జి, సబ్జెక్టు, పేపర్లు చదువుతూనే ఉండాలి' అని చెప్పాను.

అంతా ఎదురు చూసిన తారీకు రానే వచ్చింది. ఇంటర్వ్యూకి కూతురిని వెంట పెట్టుకు ఢిల్లీ వెళ్ళి వచ్చాడు. ఇంక రిజల్ట్సు రావడం తరువాయి. ఇంటర్వ్యూకి వెళ్ళి వచ్చాక రేణుక మొహం ఎందుకో అంత ఉత్సాహంగా అనిపించలేదు. కాస్త కాన్ఫిడెన్స్ తగ్గినట్టు అనిపించింది. 'ఏం రేణుకా, ఇంటర్వ్యూ సరిగా చెయ్యలేదా అలా వున్నావు?' ఆరా తీశాను.

''బాగానే చేశానమ్మా. కాని అక్కడ ఇంటర్వ్యూకొచ్చిన అందరూ టకటక ఇంగ్లీషులో మాట్లాడేసుకున్నారు. వాళ్ళందరిని చూసేసరికి ఇంగ్లీషు బాగా రాని దాన్ని నేనే కనిపించి భయం వేసింది. ఇంటర్వ్యూలో నలుగురు నాలుగు ప్రశ్నలు గబగబ వేసేసరికి తడబడ్డాను. భయం వేసింది. మీ నాయన ఏం

పని చేస్తాడు. నీ హాబీలు ఏమిటిలాంటి ప్రశ్నలు కూడా వేశారు. కాస్త తడబడిపోయి ఏం చెప్పానో...

''ఇంటర్వ్యూలో ఓవరాల్ పెర్ఫార్మెన్స్ మార్కులు అవి చూసి సెలక్ట్ చేస్తారు. ఫరవాలేదు, భయపడకు'' అని ధైర్యం చెప్పారు.

''ఏమిటో నమ్మా. ఇందాక వచ్చాక ఏమవుతుందోనని భయంగా ఉంది. అదెందుకో కాస్త దిగులుగా ఉంది' అన్నాడు నర్సింగ్‌రావు ఆందోళనగా.

''ఎందుకయ్యా అలా భయపడ్తారు. ఎస్.సి కోటాలున్న మీకేం భయం. తప్పకుండా వస్తుంది..' ప్రోత్సాహంగా అన్నాను.

ఆ కోటాలు వీరిదాకా ఎక్కడ వస్తాయి అన్నట్టుగా సెలెక్ట్ అయిన వారి పేర్ల లిస్టులో రేణుక పేరు లేదు. రేణుక నల్లబడిన మొహంతో పేపరు పట్టుకుని పరిగెత్తి వచ్చింది. తిరగా మరగా ఏ లిస్టులో చూసినా రేణుక పేరు లేదు. రేణుక పాపం పిచ్చిపిల్లలా ఏడవడం ఆరంభించింది.

''ఏటమ్మ గారూ ఇది. రాత పరిచ్చలో అంత చక్కగా పాసయింది. ఇంటర్వ్యూలో రాకపోవడం ఏంటి?' ఆఫీసు నించి రిజల్ట్స్ వచ్చాయి అని పేపరు చూసి వచ్చిన నర్సింగరావు లబలబలాడాడు.

''ఏమిటో. ఇంటర్వ్యూ సరిగాచేయలేక పోయిందేమో. భయపడ్డాను, ఇంగ్లీషులో సరిగా మాట్లాడలేక పోయాను అంటోందిగా రేణుక'' బాధగానే అన్నాను.

''అది కాదండమ్మ గోరూ. అసలు ఈళ్ళందరికి ఈ కోటాలో సీట్లు ఎలా వచ్చాయండమ్మా - ఆఫీసులో సెప్పుకుంటుంటే విన్నాను. ఇదిగో ఈ అమ్మాయి గారు మాలిని. ఎవరో కలెక్టరు గారి కూతురంట. ఈ నరేష్ అన్న అబ్బాయి జడ్జి గారబ్బాయంట. ఈ సప్న అన్న అమ్మాయి ఇరిగేషన్ డిపార్ట్‌మెంటల్ సూపరింటెండింగ్ ఇంజనీరు గారమ్మాయంట. వీల్లంతా పెద్ద ఆపీసర్ల బిడ్డలు గదా. ఈల్లంతా బి.సి, ఎస్.టిలు ఎలాగవుతారమ్మా...మాలాంటోళ్ళకి రావాల్సిన సీట్లు ఈళ్ళు తన్నుకుపోయారు'' ఉక్రోషంగా అన్నాడు.

''వాళ్ళంతా ఎంత టిప్‌టాప్‌గా ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ, ఎంతో స్మార్ట్‌గా వున్నారు. వాళ్ళకి ఈ రిజర్వేషన్ కోటాలా - ఇంటర్వ్యూలో చూశాగా' అంది ఆశ్చర్యంగా రేణుక.

నాకర్థం అయింది. రేణుక ఎందుకు సెలెక్ట్ కాలేదో!

మరి కులం ప్రకారం వాళ్ళంతా ఏ ఎస్.టి, బి.సిలో అయివుంటారు. వాళ్ళ తాతముత్తాతలుషెడ్యూల్ తరగతులకి చెంది ఉండవచ్చు. కాని ఈ పిల్లల తండ్రులు ఈ తరంలో చదువుకుని ఇంజనీర్లు, జడ్జీలు, కలెక్టర్లయి వుండవచ్చు. మరి వాళ్ళందరూ ఆఫీసర్ల పిల్లలు, కాన్వెంటులో చదువుకుంటారు. వాళ్ళ ఇంగ్లీషు, స్మార్ట్‌నెస్ రేణుక్కి ఎలా వస్తుంది?

'మరి అలాటోళ్ళందరికి ఈ కోటాల్లో సీట్లిస్తే మాలాటోళ్ళ గతేంటమ్మా.'

''అదే మరి మాలాంటి వాళ్ళు మొత్తుకుని చెప్పున్నది. ఈ కులాల ప్రాతిపదికని కాక ఆర్థిక ప్రాతిపదికన సీట్లు, రిజర్వేషన్లు వుండాలి. అంటే కులంబట్టి కాక తండ్రి సంపాదనబట్టి, బీదవారికి రిజర్వేషన్లు ఉండాలి. బీదవారు అన్ని కులాల్లోనూ ఉంటారు. సంవత్సరం ఆదాయాన్ని బట్టి వారిని ప్రోత్సహించడానికి రిజర్వేషన్లు ఇస్తే ఎవరొద్దంటారు? అలాంటి వారిని పైకి తీసుకొస్తే అందరూ సంతోషిస్తారు. కాని జరుగుతున్నదేమిటి? గత యాభై సంవత్సరాలుగా రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. అట్టడుగు వర్గాల వారికి అది అంది పుచ్చుకుని కొందరు బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. మళ్ళీ అలాంటి వారి పిల్లలింకా కులం పేరుతో సీట్లు, ఉద్యోగాలు కేటాయించడం ఎంత వరకు న్యాయం అన్నదే అందరి ప్రశ్న. ఇలాంటివి మీరంతా ఆలోచించి పోరాడాలి గాని మాల, మాదిగ అంటూ మీలో మీరు కొట్టుకుంటే ప్రయోజనం ఏముంది. తండ్రి సంపాదన ఏడాది కింతకంటే ఎక్కువ వుంటే అలాంటి వారికి రిజర్వేషన్లు ఇవ్వకూడదు అన్న ప్రాతిపదికన ప్రభుత్వం రిజర్వేషన్లు కేటాయిస్తే మీలాంటి వారికి న్యాయం జరుగుతుంది. ఇప్పుడు రేణుక సంగతే చూడు. పెద్ద పెద్ద కుటుంబాలలో పిల్లలు పోటీ పడడం వల్ల రేణుకకి రావాల్సిన సీటు రాలేదు. రేణుక ఎంత తెలివైన పిల్లయినా వారికుండే సదుపాయాలు కొన్ని ఈమెకి లేకపోవడం వల్ల నష్టపోయింది. కులరహిత రిజర్వేషన్లుండాలి. ఆర్థిక ప్రాతిపదిక, ప్లస్ మెరిట్ రెండూ చూసి సదుపాయాలు కల్పించనన్నాళ్ళు ఇలాంటి అన్యాయాలు జరుగుతూనే ఉంటాయి. ఇప్పుడు నీ కూతురు కనక ఈ బాధ నీకర్థం అయింది. సర్లే పోనీ ఐ.ఎ.ఎస్‌లో కాకపోయినా ఇన్‌కంటాక్స్, పోలీస్, ఎక్సైజ్ డిపార్టుమెంటులో ఏదో ఒక దానిలో రావచ్చు మార్కుల ప్రకారం..'' ఓదార్పుగా అన్నాను.

నర్సింగరావు మొహం మాడ్చుకున్నాడు. 'అక్కరలే. నా కూతురు కలెక్టర్ అవాలి. మళ్ళీ ఏడు పరిచ్చ రాయిస్తా. దానికి రాత్రింబగళ్ళు ఇంగ్లీషు చెప్పిస్తా. ఈసారి ఎందుకు రాదో సూస్తా... ఈ దొరబాబు బిడ్డలతో నా బిడ్డని పోటీకి నిలబెట్టి కలెక్టరు చేస్తా' పౌరుషంగా, పట్టుదలగా అన్నాడు.

నవ్వాను. 'దటీజ్ ద స్పిరిట్' అంటూ రేణుక భుజం తట్టాను.

## మృత్యువు

నాలో నేను మునగదీసుకుంటూ
ఎక్కడికో ఈ ప్రయాణం అనుకున్న క్షణం
పురోగతో
తిరోగతో
నేను చరిస్తున్న క్షణాలు
కలో నిజమో
నేను వీక్షిస్తున్న నిమిషాలు
అబద్ధం అనే నిజం
తెలిసిన చోటు
నీకవి తెలిసినప్పుడు
నిప్పును గుప్పెట పట్టినట్టు
నిజాలు గుండెను దహించినట్టు
దహనమో ఖననమో
నీవు మాత్రం నిమిత్రమాత్రురాలివి
అమ్మ ఒడిలోకి జారి
ఆడిన క్షణాలు నిజమైతే
నీ ఒడిలో నిద్రపోవడం
అంతే నిజం.
నా పుట్టుకలో నీవు పొంచి ఉన్నప్పుడు
ప్రత్యేక ఆహ్వానాలు ఎందుకు
జీవితానికి
క్షణాలు అశాశ్వితాలు కదా!

-గీతా నాగరాణి